# సోదో యమ్మ సోది

కనుపర్తి వరలక్ష్మమ్మగారు

సోదో యమ్మ సోది, సోదీ! ఎఱుకో! సోదడుగు తారమ్మ సోది. (అంటూ ఒక స్త్రీ సోదిబుట్ట నెత్తిని పెట్టుకొని వస్తుంది)

ఒక స్త్రీ (లోపలనుండివచ్చి) ఓఅమ్మో! సోదమ్మో! యిట్లారా?

సోదికత్తె.-(వచ్చి) ఏం దొరసానమ్మా! సోదడుగుతావటమ్మా!

స్త్రీ:-అడుగుతాను ఏం సోదిచెప్తావు?

సో:-ఏంసోదిచెప్తానమ్మా నీ సోదే, నీకుచెప్తాను.

స్త్రీ:-నా సోదంటే?

సో.-నీ సోది. నీ వాళ్లసోది.

స్త్రీ.-నావాళ్ల సోదేమిటమ్మో?

సో:-నీవాడకూతురివి కాదంటమ్మా?

స్త్రీ:-అవును.

సో.-మరి ఆడోరి సోదేచెప్తాను.

స్త్రీ:-మరి, ఆడోరిసోదిఒకటీ, మగోరిసోది ఒకటీనా?

సో:-మరి అంతే, ఎవరిసోది వారిదే.

స్త్రీ:-అయితే యేమివ్వాలె.

సో.-ఏమిస్తావు? పరాలిస్తవా? మూడలిస్తవా? నలుగురితోపాటియ్యి.

స్త్రీ:-నలుగురూ ఏమిచ్చారనే నేనడిగేది? అసలు ఈ వూళ్లో ఎవరికైనా చెప్పావా?

సో:-చెప్పకేమమ్మా, ఎవరికీ చెప్పకుండా తొలింగా నీ యింటికే గద్దపట్టుకొని వచ్చాననుకున్నావా? అల్లదుగో అగుడికాడ బాపనమ్మోరికి సెప్పినా, ఇల్లిదిగో ఈ సందులో సెట్టిగారి పెండ్లానికి సెప్పినా, అల్లదుగో ఆ తెలగాల అమ్మాయికి సెప్పినా, అద్దదుగో ఆకునికాడ చౌదరీగారి జేజమ్మకు సెప్పినా, అదిగో ఆ ఈదిన మొగుడిడిసినామెకు సెప్పినా, ఓ అల్లక్కడ దెయ్యంపట్టినామెకు సెప్పినా, ఓయెంతమందికో సెప్పినా.

స్త్రీ:-సరే ఏమియ్యాలో చెప్పు నేనూ సోదిఅడుగుతా

సో.-తవ్వెడు గిద్దెడు బియ్యం; పావలా రొక్కం మామూలేగా.

స్త్రీ:-అమ్మో! (గుండెకొట్టుకొని) తవ్వెడు గిద్దెడు బియ్యమే, మూడురోజుల రేషనింగు పోతుంది, తర్వాత ఏమితింటాం?

సో.-పోనీలె; అట్లాకాకపోతే అరసోలెడు బియ్యమే యిచ్చి రూపాయి రొక్కమియ్యి.

స్త్రీ.-అబ్బో! నీరేటు చాలా జాస్తిగాఉన్నదే!

సో.-అన్నిటికి పెరగలా? రూపాయిస్తే ఏమివస్తుంది.

స్త్రీ:-సరే కూర్చో! (అని లోపలికిపోయి రూపాయి కాగితము అరసోలెడు బియ్యము) చేటలో పెట్టుకొని వస్తుంది.

సో..ఏందమ్మో! రూపాయికాగితం తెచ్చావు, చేతిలోమాసిపోతది, చమటకు నానిపోతది, ఊరుపట్టుకు తిరిగేవోళ్లం; యాడపెట్టుకుంటాము. రూపాయిబిల్ల తీసుకరాఅమ్మా.

స్త్రీ:-సరే నీతో అన్నీ తంటేనే. రూపాయిలేదు, చిల్లర తేవచ్చునా?

సో.-అ మారాజులాగా తీసుకరా, నాకేమి, కాగితం మాసిపోతే కోమటాయన తీసుకోడని సెప్పినా.

స్త్రీ.-(లోపలికిపోయి డబ్బులుతీసుకవచ్చి చేటలో పెట్టి సోదికత్తె కెదురుగా కూర్చుంటుంది)

సో.-ఓ కొల్లాపురి అంకమ్మా! బెజవాడ కనకదురగమ్మా! ఈతముక్కుల జాలమ్మా! చందలూరి మాలచ్చమమ్మా! ఏడుకొండలవాడ యెంకటేశరుడా! సీశైల మల్లికార్జునుడా! మంగళాద్రి

బారసింమ్మా! గుంటూరు మస్తానయ్యా! తిరుపతమ్మా! చామాలమ్మా! ముత్యాలమ్మా! నూకాలమ్మ మొదలైన నూటొక్క సత్తెమైన దేవుల్లారా! పలికి బొంకవద్దు, ఆడితప్పవద్దు ఉండనున్నట్టు లేనిది లేనట్టు సెప్పరేఅమ్మా! నీవు దయ్యానివిగాదు, బూతానివిగాదు, పీడవుగాదు, పిశాచివిగాదే అమ్మా!

స్త్రీ:-అయితే ఎవరు?

సో:-సత్తెమైనతల్లివే అమ్మా! చదువులమ్మ నీవేనే అమ్మ! సంపదమ్మవు నీవేనేఅమ్మ! ఇందరి అమిశానబుట్టి ఏమీలేకుండ ఉన్నవేఅమ్మా! ఈనాటి దానివి కావేఅమ్మా!

స్త్రీ:-మరి ఏనాటిదాన్నంటావు?

సో:-ఓ నాల్గుయుగాలను ముందుదానవేఅమ్మా! వేదకాలంలో నీ పబయెలిగిపోయిందేఅమ్మా! రాచసభల్లో చరచల్చేవు, రుసులనే ఓడించావు, ప్రజలనే మెప్పించావేఅమ్మా! నీ సత్యాలతో నీ మగిమలతో దేవతలనే సైఁ అనిపించావేతల్లీ! కాలశక్రమే కట్టేశావేతల్లి! సూర్యచంద్రులనే నిలిపేశావెతల్లి! పగలురేతురులే ఆపినావెతల్లీ! తిరుమూరుతులె కసికందులైనారేతల్లీ! మనసూ, వాకూ, సేతా ఒకటిసేసుకొని యమడినే గెలిశావే తల్లీ! సచ్చిన మగణ్ణి బతికించుకొన్న సత్తెమంతురాలివేతల్లి! మానమంటె లెక్కసేయవే తల్లి! మానం పోతదంటె మంటలోపడి మగ్గిపోతవేతల్లి! రణాలేసేశావు, రాజ్యాలేఏలావు, తీరుపులే దిద్దావు, నీవెరుగని దరమాలు, నీవెరుగని న్యాయాలు లేవేఅమ్మా!

లోకమంతా నీ సత్తెంమందు చిత్తైందేఅమ్మా. జగమంతా నీకు తలవొగ్గిందే అమ్మా. తెల్లమొగాలోళ్లు బుట్టటోపీలవాళ్లు నీ సగ్గనూసి విస్తుపోయినరే తల్లీ!

స్త్రీ:-అంతా వెనుకటి గొప్ప చెప్పతున్నావు! ఇప్పుడుమాత్రం విస్తుపోవడంలేదా?

సో:-ఇప్పడేమిపోతరే అమ్మా!

స్త్రీ:-ఏమి?

సో:-యెనకటి సత్తా యిప్పడేదదే అమ్మా!

స్త్రీ:-ఏమైపోయింది.

సో:-ఏమైందంటవేమే అమ్మా! అనుభవిస్తూ మరిసిపోతవేమే అమ్మా! కూటికి గుడ్డకు దేబిరిస్తుందవు గదేఅమ్మా! మూటకూ మంతికి నోసుకోక పోతివి గదేఅమ్మా! బానిస బతుకు బతుకుతుందవుగదే అమ్మా! సదువా, సాయిత్యమూ అన్నీ మానిపించిరి గదేఅమ్మా!

స్త్రీ:-ఎవరు మానిపించారు?

సో:-ఓ! ఎరగవంటే అమ్మా (అని ఫుల్లతో గడ్డం చూపిస్తుంది)

స్త్రీ:-గడ్డంచూపిస్తె?

సో:-అన్నీ యిడమర్సి సెప్పాల అమ్మకి (గడ్డం చూపిస్తూ) గడ్డమంటే పురుసుడూ, స్త్రీ అంటె (బొట్టుచూపిస్తూ) బొట్టూ కాదంటేఅమ్మా! (అంటూ మళ్లీ గడ్డంచ్చూపిస్తుంది)

స్త్రీ:-అయితే యిక బాగుపడేమార్గంలేదా?

సో:-ఏమిమార్గం ఉన్నదంటవేఅమ్మా! పిల్లిగడ్డపోళ్ల కాలంలో నీ బతుకు పిల్లిమొగ్గేసిందేఅమ్మా! పాడుబావిలో పడిపోయినవేఅమ్మా! అంధకారంలో అణిగిపోయినవేఅమ్మా! వెలుగునూపినా వెలికి రాలేకపోయినావే అమ్మా!

స్త్రీ:-అయితే ఇప్పుడు బాగుపడకూడదా?

సో:-ఏం బాగుపడతవే తల్లీ! ఈ నాగరీకం, ఈసోకు నీకు ఎక్కువైందే తల్లీ! (అని వీపు చూపిస్తుంది,

స్త్రీ:-వీపు చూపిస్తే?

సో:-ఓయమ్మ ఈమాత్రం తెలుసుకోలేవంటెఅమ్మా వెన్నంటే పడమటా గుండెఅంటే తూరుపు కాదంటేఅమ్మా!

స్త్రీ:- పడమటి నాగరీకం ఎక్కువైదంటావా ?

సో:- అఁమరేం అనుకున్నావు. పడమటోళ్ళ పందా పట్టావు, తూరుపు వెలుగులు సూడమరిశావు, పల్లెపట్టులు వదలిపెట్టావు, బస్తీమోజుల కెగబడ్డావు, సీమసోకులు సేత్తానంటవు, సిలుకుశీరెలు కట్టా నంటవు. సినిమాలకు పోతానంటవు, కాపీనీల్లు తాగుతనంటవు, కల్లల్లోపానాలు నిలుపుతనంటవు, నీబలమూ నీశగితీ మరిసిపోయినావేఅమ్మా! కాయ కష్టం మానావే అమ్మా! సోమారిసోకులు మరిగేవే అమ్మా! ఇంకా పాడుగాక ఏమవుతవే అమ్మా! నీమేలు సూశేవోరూ! నీకష్టం విశారించేవోరూ లేరెఅమ్మా! నీకునీవే విశారించుకోవాలే అమ్మా!

స్త్రీ:- ఎట్లావిచారించుకోవాలె ?

సో:- ఎట్లాగంటవేమే అమ్మా! నీ మంచి సూడడానికి సంగముండది కాదంటె అమ్మా!

స్త్రీ:- ఏమి సంఘం మహిళాసంఘమా!

సో:- అద్దదేనే తల్లే! అందులో సేరవే థల్లే! అదే నీ మేలుసూత్తదే థల్లీ! నీ మంచికోరతదే థల్లీ!

స్త్రీ:- అది ఎక్కడో ఉంటే మాకేమి అందుబాటు ?

సో:- అందుబాటులేకేమే అమ్మా! నీవు యాడనుంటే అడకే వస్తుందే అమ్మా!

స్త్రీ:- వస్తుందీ ?

సో:- తప్పకుండా వత్తదే తల్లీ! నీవు యాడకూ పోవద్దే తల్లి! నీయిల్లు వాకిలీ, నీగొడ్డూగోద, నీపిల్లాజెల్లా సూసుకుంటూ, కదురూ కవ్వమూ తిప్పుకుంటూ, నీపాదులోనే నీవు ఉండవేఅమ్మా! జాతిద్వేసం జన్మద్వేసం నేర్చుకోకే అమ్మా! వరగబేదాలు, వరణబేదాలు పెట్టుకోకే అమ్మా! చీలికలు పేలికలు సేసుకోకే అమ్మా! పుంజాలతో పోరు పెట్టుకోకే అమ్మా! పెట్టలందర్నీ కూడగట్టుకోవే అమ్మా! సంఘమంతా ఒక్కటై, ఒక్కమాటమీద నిలిసి ఒక్క బాటమీద నడిసి పెద్దమనిసనిపించు కోనే తెన్నుసూసుకోవేతల్లీ! పెద్దలపేరు నిల పవే తల్లి! లోకమంతా నీదిగ సూసుకోవే తల్లే! లోకులంతా నీవారుగ ఎంచుకోవే తల్లే! నీకు కావలసినవన్నీ అవే వత్తవే థల్లే!

స్త్రీ:- అయితే ఆ సంఘానికేమైన యివ్వాలా ?

సో:- ఏమిత్తవు ? వరాలిత్తవా ? రూపాయిలిత్తవా ? అరదలిత్తవా ? సాలుకో పావలాయిచ్చి, సంఘం లోసేరవే తల్లీ! వేయి వరాల లాబం పొందుతవేఅమ్మా! కష్టాలన్నీ తుప్పన దూలిపోతాయే అమ్మా! సౌక్యంగా ఉంటవేఅమ్మా, (అని బియ్యం తట్టలోపోసుకుంటూ) ఓ అమ్మ! ఆకలవుతున్నది, ఓముద్ద అన్నముంటే పెట్టమ్మా! నీవు కట్టిడిసిన కోత్తకోకుంటె యియ్యిథల్లే! నీసెమటను మాసిన సిలుక్కరవికుంటే పారేయమ్మా! మా బుడ్డోడికో చొక్కాయియ్యమ్మా! నీకు పుణ్యముంటది నీపేరు సెప్పుకుంటా థల్లే!

